క్లుప్తంగా

బాల్య వివాహాలతో అనర్థాలు



చింతూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

చింతూరు: బాల్య వివాహాల కారణంగా అనర్థాలు చోటు చేసుకుంటాయని, వాటిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని చింతూరు సీడీపీవో విజయగౌరి అన్నారు. ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన బేటీ బచావో, బేటీ పఢావో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న వయస్సులోనే వివాహాలు చేయకుండా తల్లులు జాగ్రత్త వహించాలని సూచించారు. అనంతరం సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ సంఘమిత్ర, పార్వతి, రాజు పాల్గొన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు



రంపుల వద్ద మరమ్మతుకు గురై నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

గూడెంకొత్తవీధి: కండిషన్ సరిగ్గా లేని బస్సులను మన్యానికి పంపుతుండడంతో ఇవి ఎక్కడికక్కడ ఆగిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం పాడేరు నుంచి మంప వెళ్తున్న ఆర్టీసీ బస్సు మరమ్మతుకు గురై రంపుల గ్రామం వద్ద నిలిచిపోయింది. దీంతో బస్సులో వెళ్తున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అసలే తక్కువగా తిరిగే సర్వీసులు ఎక్కడికక్కడ మరమ్మతులతో ఆగిపోతుండడంతో ప్రత్యామ్నాయం లేక ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారని మన్యపుత్ర యువజన సంఘం అధ్యక్షుడు సోమేష్‌కుమార్ అన్నారు. ఈ విషయంపై పాడేరు ఆర్టీసీ డిపో మేనేజరుకు ఫిర్యాదు చేస్తున్నట్టు తెలిపారు.

ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: అందరికీ ఆధార్ కార్డులు అందించాలని ఇందుకోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సోమవారం సమీక్ష నిర్వహించారు.పాఠశాలల్లో మరుగుదొడ్లు నిర్వహణతోపాటు ఇంటింటి సర్వే వంటి పలు అంశాలపై సమీక్షించి పలు సూచనలు చేశారు.

త్రిపురాంతకస్వామికి ప్రత్యేక పూజలు

కశింకోట: కశింకోటలోని సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వి.చిదంబరం, వి.కృష్ణల ఆధ్వర్యంలో మధ్యాహ్నం పేదలకు అన్నదానం చేశారు.

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు



బాల్య వివాహాల నిర్మూలనకు నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

కశింకోట: బాల్య వివాహాలు ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు సీడ్ ఆర్గనైజేషన్ కో–ఆర్డినేటర్ కె.వి.చిన్నారావు హెచ్చరించారు. మండలంలోని తేగాడ, పేరంటాల పాలెం గ్రామాల్లో బాల్య వివాహాల నిర్మూలనపై సోమవారం సీడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జాతీయ ఉపాధి పథకం కూలీలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు నిర్మూలించాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో 31, 39 ప్రకారం బాల్య వివాహాలను ప్రోత్సహించిన వారిపై తక్షణ చర్యలు తప్పవన్నారు. 18 ఏళ్లలోపు వయస్సు ఉన్న ఆడ పిల్లలకు వివాహాలు చేయరాదన్నారు. బాల్య వివాహాలతో పిల్లల ఆరోగ్యం దెబ్బతింటోందన్నారు. ఈ కార్యక్రమంలో సీడ్ ఆర్గనైజేషన్ సీఎస్‌డబ్ల్యూ మహాలక్ష్మి, కార్మిక శాఖ అధికారి కె.బాలకృష్ణ, సీడ్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల ఆలయ వార్షికోత్సవం

రావికమతం: కొమిరలో సీతారాముల ఆలయ వార్షికోత్సవం సోమ వారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం చిత్ర విచిత్రమైన నేలవేషాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నిలువ నీడ కరువు

- శిథిలావస్థకు చేరిన బస్ షెల్టర్లు
- ప్రయాణికులకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



హట్టగుడలో నిరుపయోగంగా బస్ షెల్టర్



గన్నెలలో శిథిలావస్థ బస్ట్ షెల్టర్ వద్ద ప్రయాణికులు

అరకులోయ టౌన్: గిరిజన ప్రాంతంలో ప్రయాణికుల కోసం నిర్మించిన బస్ షెల్టర్లు శిథిలావస్థకు చేరడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రయాణికులు నిరీక్షించాల్సిన బస్ షెల్టర్లు మరమ్మతుకు గురైనప్పటికీ ప్రభుత్వం, సంబంధిత శాఖాధికారులు పట్టించుకోకపోవడంతో బస్ షెల్టర్లు పిచ్చిమొక్కలకు నిలయాలుగా మారాయి. విష కీటకాలకు ఆవాసాలుగా మారాయి. ప్రయాణికులకు భయాందోళన కలిగిస్తున్నాయి. మండల కేంద్రంలోని సరైన బస్‌షెల్టర్లు లేక ప్రయాణికులు పడుతున్న పాట్లు వర్ణనాతీతం. వర్షాకాలంలో వానకు తడిచి, ఎండ కాలంలో ఎండలో ఉండలేక ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బస్‌షెల్టర్లు నిరుపయోగంగా ఉండడంతో ఆరుబయటే ఎండలో నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. ప్రయాణికులు ఎండకు బెంబేలెత్తుతున్నారు. మండలంలోని హట్టగుడ, గన్నెల, బెంజిపూర్, లోతేరు, పానిరంగిని, యండపల్లివలస, గన్నెల జంక్షన్, తదితర గ్రామాల్లోని బస్ షెల్టర్లు శిథిలావస్థకు చేరాయి. అధికారులు స్పందించి బస్ షెల్టర్లను బాగు చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



గ్రామంలో గత కొన్నేళ్ల క్రితం నిర్మించిన బస్‌షెల్టర్ శిథిలావస్థకు చేరింది. పశువులకు స్థావరంగా మారింది. శిథిలదశలో ఉన్న బస్ షెల్టర్‌లో పశువులు, కుక్కలు ఉంటున్నాయి. ప్రయాణికులు కనీసం నిలబడేందుకు వీలు లేదు. దీంతో ప్రయాణికులు రోడ్డుపైనే నిలబడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి బస్ షెల్టర్‌కు మరమ్మతు చేసి, ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలి.

– శెట్టి ఆనందరావు, గిరిజనుడు, గన్నెల గ్రామం, అరకులోయ మండలం

ప్రతిపాదనలు పంపాం

పాడేరు డివిజన్ పరిధిలోని ఆర్‌అండ్‌బీ ఇంజినీరింగ్ శాఖ పరిధిలో శిథిలావస్థకు చేరిన బస్ షెల్టర్‌లు బాగు చేసేందుకు ప్రతిప్రాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి అనుమతిచ్చి, నిధులు మంజూరు చేస్తే శిథిలావస్థకు చేరిన బస్ షెల్టర్‌లు బాగు చేస్తాం. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాలను అందుబాటులోకి తీసుకువస్తాం.

– విజయ్ సాల్‌మన్, డీఈఈ, ఆర్‌అండ్‌బి శాఖ, పాడేరు

బక్కలపనుకులో తాగునీటి సమస్య

వారం రోజులుగా నిలిచిన నీటి సరఫరా



నిరుపయోగంగా తాగునీటి పథకం



మూలకు చేరని చేతిబోరు

పాడేరు రూరల్: మండలంలో పాడేరు మేజర్ పంచాయతీ పరిధిలోని బక్కలపనుకుల గ్రామంలో తాగునీరు సమస్య తీవ్రంగా ఉంది. ఈ సందర్భంగా గ్రామస్తులు భీమేష్, దాసు, రాజు తదితరులు మాట్లాడుతూ గ్రామానికి సరఫరా అయ్యే పైపు లైన్ దెబ్బతినడంతో తాగునీటి కష్టాలు ప్రారంభమైనట్టు చెప్పారు. గ్రామంలో తాగునీటి బోరు పాడైందని, తాగునీటి కోసం సుదూరంలో ఉన్న గెడ్డలను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలుషిత నీరు వినియోగ వారం రోజులుగా తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. గ్రామంలో తాగునీటి పథకం నిరుపయోగంగా మారిందని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

ఉత్తమ ఫలితాలపై దృష్టి



విద్యార్థులతో మాట్లాడుతున్న పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో నైట్ స్టడీ ఉపాధ్యాయులు సకాలంలో విద్యార్థులకు అందుబాటులో ఉండాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. ముసురుమిల్లి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను సోమవారం రాత్రి ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలన్నారు. ఉత్తమ ఫలితాల సాధనపై దృష్టి సారించాలన్నారు. చదువులో బాగా వెనుకబడిన విద్యార్థులుంటే వారిని గుర్తించి బాగా చదివించాలన్నారు. విద్యార్థులకు అందించిన ఆహార పదార్థాల వివరాలు తెలుసుకున్నారు.

పాఠశాల ఎత్తివేతపై విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

రాజవొమ్మంగి: పాఠశాలలో పిల్లల సంఖ్య తక్కువగా ఉందనే నెపంతో తమ గ్రామంలోని ఎంపీపీ పాఠశాలను విద్యాశాఖ ఎత్తివేసే ప్రయత్నాలు చేయడంపై మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేశారు. వీరంతా సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకొని ధర్నా చేశారు. తమ గ్రామంలోని 2, 3, 4 తరగతులకు చెందిన పిల్లలను వేరే స్కూల్‌కు తరలించే ప్రయత్నాలు జరుగుతుండడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎంపీడీవో యాదగిరీశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. పాఠశాల ఎత్తివేసే ప్రయత్నం విరమించేలా చూడాలని వారు కోరారు. లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. సర్పంచ్ కుంజం జగన్నాథం, గ్రామపెద్దలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంబరాలు



మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకుంటున్న ఉపాధ్యాయులు

చింతపల్లి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గాదె శ్రీనివాసులనాయుడు గెలుపొందడంతో చింతపల్లిలో ఉపాధ్యాయులు సంబరాలు జరిపారు. పీఆర్‌టీయూ ఉపాధ్యాయులంతా సంఘటితంగా ఉండి తమ బలాన్ని మరోసారి నిరూపించుకున్నారన్నారు. కార్యక్రమంలో యు.వి.గిరి, వరలక్ష్మి, మత్స్యలింగం, ప్రసాద్, సత్తిబాబు, వెంకటరమణ కోరాబు చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సెకండియర్ పరీక్ష

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాల కేంద్రంలో సోమవారం ద్వితీయ ఇంటర్ మొదటి రోజు పరీక్ష (తెలుగు –2) ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు 278 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 273 మంది పరీక్ష రాశారని, అయిదుగురు గైర్హజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ సంతోషికుమారి తెలిపారు. ఈ కేంద్రంలో గురుకుల కళాశాల బాలికలతో పాటు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, టెన్ ప్లస్ విద్యార్థులు, ప్రైవేట్ కాలేజీల విద్యార్థులు పరీక్ష రాసినట్టు చెప్పారు.

అడ్డతీగల: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు మొదటి రోజు సోమవారం అడ్డతీగలలోని రెండు పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగాయి. గురుకుల కళాశాల పరీక్షా కేంద్రంలో 190 మందికి గాను 179 మంది రాశారు. 11 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 272 మందికి గాని 244 మంది పరీక్ష రాయగా, 28 మంది గైర్హాజరైనట్టు అధికారులు తెలిపారు.

కృష్ణకుమారికి విశ్వశాంతి పురస్కారం



హైదరాబాదులో అవార్డు అందుకుంటున్న కృష్ణకుమారి

దుంబ్రిగుడ: మండల కేంద్రానికి చెందిన సంఘ సంస్కర్త, నేరనిరోధక రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు కృష్ణకుమారికి విశ్వశాంతి పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె ఫోన్‌లో విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆర్యాని సకల కళావేదిక ఆధ్వర్యంలో విశ్వశాంతి–2025 అవార్డును తనకు అందజేసి, సన్మానించినట్టు చెప్పారు. స్థానిక విలేకరులకు సోమవారం ఆమె తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

సీనియర్ సివిల్ జడ్జి పి.షియాజ్ ఖాన్



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి షియాజ్ ఖాన్

నర్సీపట్నం: బాలికలపై జరుగుతున్న దుశ్చర్యలకు అడ్డుకట్ట వేసేందుకు అనేక చట్టాలు ఉన్నాయని సీనియర్ సివిల్ జడ్జి పి.షియాజ్ ఖాన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో సోమవారం చైల్డ్ మ్యారేజ్, గుడ్ టచ్...బ్యాడ్ టచ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికలను ఉద్దేశించి జడ్జి మాట్లాడుతూ బాలికలు, మహిళల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయన్నారు. చట్టాలపై కనీస అవగాహన ఉండాలన్నారు. పోక్సో చట్టం చాలా తీవ్రంగా ఉంటుందన్నారు. ఈ కేసులో ఇరుక్కుంటే భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. బాల్య వివాహాలు ప్రోత్సహించకూడదన్నారు. ఆడపిల్లలను బాగా చదివించాలన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించిన వారు శిక్షార్హులు అవుతారన్నారు. అనంతరం డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన్నారులపై కామాంధుల కళ్లు పడుతున్నాయని, చాలా సందర్భాల్లో తెలిసిన వారే దుశ్చర్యకు ఒడిగడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీటి బారిన పడకుండా మన పిల్లలకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ చెప్పాలన్నారు. బాలికలపై లైంగిక వేధింపులకు అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోందన్నారు. కార్యక్రమంలో సీఐ గోవిందరావు, ఎల్.రేవతమ్మ, ఎంఈవో తలుపులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏయూలో క్రమశిక్షణకు అధిక ప్రాధాన్యం

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో విద్య సంబంధిత క్రమశిక్షణను పెంపొందించడానికి అత్యధిక ప్రాధాన్యమిస్తామని వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. ఇంజినీరింగ్, మహిళా ఇంజినీరింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు, ఆచార్యులతో సోమవారం ఉదయం ఆయన సమావేశమయ్యారు. మధ్యాహ్నం ఫార్మసీ, న్యాయ, ఆర్ట్స్, ఆర్ట్స్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు, ఆచార్యులతో సమావేశం నిర్వహించారు. ప్రతి విభాగంలో వసతుల కల్పన తదితర అంశాలకు సంబంధించిన వివరాలు, వినతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విభాగాల్లో తరగతులు పటిష్టంగా నిర్వహించాలని, విద్యార్థులు పూర్తిస్థాయిలో తరగతులకు హాజరు కావాలన్నారు. ప్రతి తరగతిలో విద్యార్థులందరూ నియమావళిని అనుసరించేలా ఆచార్యులు, విభాగాధిపతి చొరవ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు నిత్యం తరగతులకు వస్తేనే వారి నైపుణ్యాలు మరింత మెరుగవుతాయని, భవిష్యత్తులో ఉన్నత, ఉపాధి అవకాశాలను పొందడానికి వీలవుతుందని చెప్పారు. త్వరలో విభాగాల వారీగా సమీక్ష నిర్వహిస్తామని, ప్రతి విభాగంలోని సమస్యలను పరిష్కరించి, వసతులు మెరుగుపరచి అభివృద్ధి దిశగా నడిపించే ప్రయత్నం చేస్తామన్నారు. త్వరలో జరగనున్న శతాబ్ది ఉత్సవాల్లో ప్రతి విభాగం భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ప్రిన్సిపాళ్లు జి.శశిభూషణరావు, జి.గిరిజా శంకర్, ఎం.వి.ఆర్.రాజు, కె.సీతామాణిక్యం, డి.నాగరాజకుమారి, ఆర్.పద్మశ్రీ పాల్గొన్నారు.

మంచం పైనుంచి పడి విద్యార్థినికి గాయాలు

పెదబయలు: స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న కిల్లో అక్షిత పాఠశాల వసతి గృహంలో మంచంపై నుంచి కింద పడిన ఘటనలో చిన్నారి తలకు బలమైన గాయమైంది. సోమవారం తెల్లవారు జామున పాఠశాల వసతి గృహంలో నిద్ర మత్తులో మంచం పైన వరుస నుంచి కింద పడింది. దీంతో అక్షిత తలకు బలమైన గాయం కావడంతో హుటాహుటిన పెదబయలు పీహెచ్‌సీకి తరలించడంతో స్థానిక వైద్యాధికారి నిఖిల్ ప్రాథమిక చికిత్స అందించి పాడేరు జిల్లా ఆస్పత్రికి సిఫార్సు చేశారు.ఈ విషయంపై మండల ఏటీడబ్ల్యూవో స్వర్ణలత మాట్లాడుతూ నిద్ర మత్తులో విద్యార్థిని మంచం పై నుంచి పడడంతో తలకు గాయమైందని వెంటనే పెదబయలు పీహెచ్‌సీకి తరలించి అక్కడ నుంచి పాడేరు జిల్లా సర్వజన ఆస్పత్రికి తరలించినట్టు చెప్పారు. విద్యార్థిని తలకు మూడు కుట్లు పడ్డాయని, ఎలాంటి ప్రాణాపాయం లేదని ఆమె చెప్పారు.

జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పరుగు పోటీలు నేడు

దేవరాపల్లి: కొత్తూరు ముత్యాలమ్మపాలెంలో అభయాంజనేయ స్వామి తీర్థ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు సర్పంచ్ గంధం రామకృష్ణ తెలిపారు. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పరుగు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ వెంకటేశ్వరరావు, రమణ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభారతి

చింతపల్లి: మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని చింతపల్లి ఎస్ఐలు వెంకటేశ్వరరావు, ఎం.వి.రమణలు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభారతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, అధ్యాపకులు మాట్లాడారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస పాత్రుడు, అధ్యాపకులు రమణ రవీంద్రనాయక్, జగదీష్‌బాబు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ



ముంచంగిపుట్టులో విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది

ముంచంగిపుట్టు: కంటి చూపు విషయంలో ప్రతి ఒక్కరు తగు జాగ్రత్తలు పాటించాలని కిలగాడ వైద్యాధికారి శిరీష అన్నారు. మండలంలోని కిలగాడ కేజీబీవీ, ముంచంగిపుట్టు బాలుర, బాలికల పాఠశాలల్లో విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వైద్యాధికారి శిరీష మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు గతంలో దృష్టి లోపంపై వైద్య శిబిరం నిర్వహించి, దృష్టి లోపంతో బాధపడుతున్న విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేశామన్నారు. ముంచంగిపుట్టు మండలంలో 112 మంది విద్యార్థులకు కళ్లద్దాలు అందజేశామన్నారు. ఎటువంటి కంటి సమస్యలు ఉన్నా వెంటనే వైద్యులను సంప్రదించాలని, నిర్లక్ష్యం చేయవద్దన్నారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ ప్రసన్న, హెచ్‌ఎంలు మాణిక్యాలరావు, లక్ష్మి, ప్రకాశం, ఆప్తామాలిక్ అసిస్టెంట్ కిషోర్‌కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనచోదకులకు అవగాహన



వాహనచోదకులకు అవగహన కల్పిస్తున్న ఎస్ఐ పాపినాయుడు

దుంబ్రిగుడ: నూతన మోటార్ చట్టంలో భాగంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనచోదకులకు జరిమానా విధిస్తామని ఎస్ఐ కె.పాపినాయుడు చెప్పారు. మండల కేంద్రంలోని ఆటో, జీపు డ్రైవర్లకు సోమవారం నూతన మోటార్ చట్టంపై అవగాహన కల్పించారు. డ్రైవర్లు తప్పనిసరిగా వాహనపత్రాలు కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే భారీ జరిమానాలు చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. పర్యాటకులు ఎటువంటి మాదక ద్రవ్యాలు వంటి జోలికి వెళ్లవద్దని సూచించారు. గంజాయి రవాణా చేస్తు పట్టుబడితే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

10న జంగమయ్య జాతర



ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సర్పంచ్ నాగేశ్వరరావు తదితరులు

దుంబ్రిగుడ: మండలంలోని గుంటసీమ పంచాయతీ కేంద్రంలో జంగమయ్య జాతర మహోత్సవాన్ని ఈనెల 10న నిర్వహించనున్నట్టు సర్పంచ్ గుమ్మా నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఏటా వైభవంగా జాతర మహోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే ఈ ఏడాది కూడా వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. కోలాటం, ఒడియా నాటకం, థింసా నృత్యాలు, డ్యాన్స్ బేబీ డ్యాన్స్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. జాతర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శాఖ చొరవతో పాఠశాలలో సమస్యలకు పరిష్కారం



జి.మాడుగుల ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికల వసతి గృహంలో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న సీఆర్‌పీఎఫ్,పోలీస్‌శాఖలు

జి.మాడుగుల: మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గల బాలికల వసతి గృహంలో నెలకొన్న తాగునీటి సమస్య, ఇతర సమస్యలను స్థానిక పోలీస్‌శాఖ, సీఆర్‌పీఎఫ్ 198బెటాలియన్ సంయుక్తంగా పరిష్కరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గల బాలిక వసతి గృహాన్ని ఎస్ఐ షణ్ముఖరావు గతంలో సందర్శించినప్పుడు వసతి గృహంలో తాగునీరు, విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు, మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సదుపాయం లేపోవడంత, వాటర్ ట్యాంక్ లేకపోవడాన్ని విద్యార్థినులు దుస్తులు ఆరవేసుకునేందుకు సదుపాయం లేకపోవడాన్ని గుర్తించారు. పరీక్షలకు రైటింగ్ మెటీరియల్స్ లేకపోవటం, భవనం చుట్టూ పిచ్చి మొక్కలు నిండి ఉండటంతో విష సర్పాలు సంచారంతో ఇబ్బందులు తదితర సమస్యలును ఆయన దృష్టికి పలువురు తీసుకువచ్చారు. విద్యార్థినుల సమస్యలు, ఇబ్బందులపై ఎస్ఐ స్పందించి సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్ ఓసీ రాజా కెసీకు తెలియజేసి వాటిని సోమవారం పరిష్కరించారు. దీంతో విద్యార్థినులందరూ పోలీస్‌శాఖ, సీఆర్‌పీఎఫ్ అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇంటర్ పరీక్షలు శత శాతం ఉత్తీర్ణత సాధించాలని వారు ఆకాంక్షించారు. కళాశాల బాలికల వసతి గృహంలో సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపి సీఆర్‌పీఎఫ్ 198బిఎన్ కమాండెంట్ రాజేష్‌పాండే, ఓసీ రాజాకు పోలీస్ స్టేషన్ ఎస్ఐ షణ్ముఖరావు ధన్యవాదాలు తెలియజేశారు.

ఆలయ నిర్మాణానికి రూ.3 లక్షల విరాళం

పాయకరావుపేట: మండలంలోని కుమారపురంలో తలపెట్టిన శ్రీకుమార ఉమా రామలింగేశ్వర శివాలయం నిర్మాణానికి గ్రామానికి చెందిన నీలాపు వేణు వెంకట కృష్ణారెడ్డి రూ.3,33,333 విరాళం అందజేశారు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా ఈ విరాళాన్ని చెక్కు రూపంలో గ్రామ పెద్దలకు అందించారు.